వేతనాల కోసం ఎదురుచూపులు

- ఆకలితో అలమటిస్తున్న క్లాప్ మిత్రలు
- ఐదు నెలలుగా అందని వేతనాలు
- నిధులు లేవంటూ చేతులెత్తేస్తున్న పంచాయతీలు

బేస్తవారిపేట: గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రతపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెడుతున్నారు. చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్యదర్శులను ఆదేశిస్తున్నారు. అయితే ప్రజారోగ్యం, పరిశుభ్రత కోసం కృషి చేస్తున్న క్లాప్ మిత్రల పరిస్థితి దయనీయంగా మారింది. నెలకు రూ.6 వేల వేతనంతో పనిచేస్తున్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్నా ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లించడంలేదు. అరకొర వేతనాలు నెలల తరబడి అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంటోందని క్లాప్ మిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతన బకాయిలు చెల్లింపు కోసం పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

గ్రామ సచివాలయాల్లో పారిశుద్ధ్య పనులు, తడి-పొడి చెత్త సేకరణ కోసం ప్రభుత్వం క్లాప్ మిత్రలను అందుబాటులోకి తెచ్చింది. వెయ్యి మంది జనాభా లేక 250 గృహాలకు ఒక క్లాప్ మిత్రను ఏర్పాటు చేశారు. బేస్తవారిపేట మండలంలో 49 మంది క్లాప్ మిత్రలు పనిచేస్తున్నారు. వీరికి ఐదు నెలలుగా వేతనాలు అందడంలేదు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వేతనంపై ఆధారపడిన క్లాప్ మిత్రల కుటుంబాలు కూడా అర్థాకలితో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. గౌరవ వేతనాలను పంచాయతీల నుంచి పంపిణీ చేయనప్పటికీ క్లాప్ మిత్రలు ఆర్థిక ఇబ్బందులు పడుతూనే పారిశుద్ధ్య పనుల కోసం ఎంతో శ్రమిస్తున్నారు.


పూసలపాడులో చెత్తను సేకరిస్తున్న క్లాప్‌మిత్రలు

నిధుల సమస్యతోనే..

గ్రామ పంచాయతీలకు నిధుల సమస్య వెంటాడుతోంది. పంచాయతీలకు సాధారణ నిధులు లేకపోగా, 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా వేరే పథకాలకు మళ్లిస్తున్న పరిస్థితితో పంచాయతీలు ఆర్థికంగా సతమతమవుతున్నాయి. మేజర్ పంచాయతీల పరిధిలో రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు అందుతుండగా, మిగిలిన పంచాయతీల్లో అంతే కష్టపడుతున్న క్లాప్ మిత్రలకు మాత్రం గౌరవ వేతనాలు పంపిణీ కావడం లేదు. క్లాప్ మిత్ర కార్మికులకు కూడా సకాలంలో గౌరవ వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉండటం దారుణమని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.


వీధుల్లో రోడ్లను శుభ్రం చేస్తూ

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

అరకొర జీతంతో పనిచేసే క్లాప్ మిత్రల వేతనాలు వెంటనే చెల్లించాలి. ఐదు నెలలుగా ఎంతో శ్రమిస్తున్న కార్మికుల గౌరవ వేతనాలు చెల్లించకపోవడం దారుణం. ఆర్థికంగా క్లాప్ మిత్రలు ఇబ్బందులు పడుతున్నారు. వేతన బకాయిలు మొత్తం విడుదల చేయాలి.

– ధాకాల పుల్లయ్య, సీపీఐ నాయకుడు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడికి 'అన్నా' నివాళి


శివారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

పొదిలి రూరల్: పొదిలి మండలం ఈగలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పాశం శివారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, యోగిరెడ్డి, కోదండరామిరెడ్డి ఉన్నారు.

మల్బరీ సాగులో సస్య రక్షణపై అవగాహన

అర్ధవీడు: మండలంలోని మాగుటూరులో మల్బరీ సాగు చేస్తున్న రైతులకు సస్యరక్షణ చర్యలపై జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి డాక్టర్ పి.సుజయ్‌కుమార్ సోమవారం అవగాహన కల్పించారు. మైసూరులోని కేంద్ర పట్టు మండలి శిక్షణ సంస్థ శాస్త్రవేతలు డాక్టర్ జోయిసీ రాణి, డాక్టర్ బి.వజ్రమ్మ పట్టు పరిశ్రమలో అనుసరించాల్సిన పద్ధతులు, లాభాలు పొందే విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఓ శివ గంగప్రసాద్, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, వీఓఏలు, ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తల్లిపాలతో శిశువులకు ఆరోగ్యం


గిద్దలూరు : మాట్లాడుతున్న సీడీపీఓ మహిత

గిద్దలూరు రూరల్: తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సీడీపీఓ కె.మహిత సూచించారు. పట్టణంలోని రావి చెట్టు వీధిలో గల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రతి రెండో శనివారం కిశోర బాలికల సమావేశాన్ని నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఐసీడీఎస్ లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని, అవతకవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, వసంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో చిన్నారుల ప్రతిభ

త్రిపురాంతకం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విశ్వనాథపురం విద్యార్థినులు ప్రతిభ చాటారు. మండలంలోని విశ్వనాథపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు జిల్లా స్థాయిలో యర్రగొండపాలెంలో జరిగిన పోటీల్లో అండర్-14 విభాగంలో హైజంప్, లాంగ్‌జంప్, పరుగు పందెంలో టి.అమూల్య ప్రథమ స్థానం, పీవీ కావ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-16 విభాగంలో కె.ఇందు పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచారు. బాపట్లలో జరిగే పోటీల్లో వీరు జిల్లా తరపున ఎంపికయ్యారు.

గ్రీవెన్స్‌కు 21 అర్జీలు

మార్కాపురం: మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 21 మంది తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. కేఆర్సీ తహసీల్దార్ దిలీప్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపుతామని కేఆర్సీ తహసీల్దార్ తెలిపారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కోర్టు సెంటర్‌లో ఉన్న ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 6వ తేదీన శంకర నేత్రాలయ సహకారంతో వాసవీ క్లబ్ పర్యవేక్షణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు కె.రవికుమార్, రామకృష్ణ తెలిపారు. వైద్య శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుందని. శుక్లాలు ఉన్నవారిని బుధవారం సాయంత్రం ప్రత్యేక బస్సులో శంకర నేత్రాలయకు తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తాయని తెలిపారు. వైద్య శిబిరానికి హాజరయ్యేవారిలో బీపీ, సుగర్ బాధితులు ఉంటే సంబంధిత మందులు వెంట తీసుకురావాలని, ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, దుస్తులు తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. వివరాలకు 98482 91408, 94920 81140ను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా ఎల్లమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల


విగ్రహ ప్రతిష్ఠ లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా

- భక్తులను ఆశీర్వదించిన స్వరూపనందగిరి స్వామి

కొనకనమిట్ల: మండలంలోని ఇరసలగుండం గ్రామంలో నాగారపు ఎల్లమ్మతల్లి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఎల్లమ్మతల్లి, పోతురాజుస్వామి విగ్రహ, కలశ ప్రతిష్ఠను పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉభయదాతలుగా గోపిరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ముందుగా గ్రామంలో ఎల్లమ్మతల్లి విగ్రహాన్ని మేళతాళాల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా బొల్లావుల ఉత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుపతిలోని శ్రీనివాస మంగాపురంలో గల వశిష్ఠాశమ లలితపీఠ వ్యవస్థాపక పీఠాధిపతి స్వరూపనందగిరిస్వామి ఎల్లమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, పార్టీ నాయకులు పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.


ప్రతిష్ఠించిన శ్రీనాగారపు ఎల్లమ్మతల్లి మూలవిరాట్

రెడ్డి మహిళా కళాశాల హాస్టల్ ప్రారంభం


హాస్టల్‌ను ప్రారంభిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: మార్కాపురంలోని రెడ్డి మహిళా జూనియర్ డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్‌ను కళాశాల అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు బాగా చదువుకుని కళాశాలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కళాశాలలో విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ గాదె రామచంద్రారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భారతమ్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రావి గాయత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయండి


అన్నా రాంబాబును సన్మానిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అప్పగించిన బాధ్యతలను నూతనంగా పదవులు పొందిన నాయకులు సక్రమంగా నిర్వర్తించడంతోపాటు కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా నియమితులైన సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి సోమవారం రాత్రి మార్కాపురంలోని అన్నా రాంబాబు నివాసానికి పార్టీ నాయకులతో వెళ్లి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. నాయకులందరూ ప్రజల్లోకి వెళ్లాలని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లబోతుల కొండయ్య, పంబి వెంకటరెడ్డి, బూదాల గురవయ్య, శ్రీకాంత్‌రెడ్డి, గౌస్ మొద్దీన్, తుమ్మా వెంకటరెడ్డి, మందటి శివారెడ్డి తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అన్నా


ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

మార్కాపురం: ముందు వెళ్తున్న మోటారు సైకిల్‌ను వెనుక నుంచి స్కూల్ బస్సు ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణ శివారులోని మార్కెట్ యార్డు వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. తర్లుపాడు మండలం తాడివారిపల్లి గ్రామానికి చెందిన ఎం.రమేష్‌నాయుడు, పొన్నలూరు మండలం పెద్దవెంకన్నపాలేనికి చెందిన టి.విజయ్‌కుమార్ పట్టణంలోని ఓ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో లోన్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు. సోమవారం ఇద్దరూ తమ బైక్‌పై మార్కెట్ యార్డు మీదుగా దరిమడుగు వైపు వెళ్తుండగా వెనుక నుంచి ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు తన కారు ఆపి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులను ఆటోల్లో జీజీహెచ్‌కు తరలించే ఏర్పాట్లు చేశారు. సంఘటన స్థలాన్ని పట్టణ ఎస్సై పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'

కంభం: ఏపీ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని ఈనెల 5 నుంచి మూడు నెలలపాటు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు ముక్కు ప్రసాద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్దకు ఏపీజీఈఏ యూనియన్ నాయకులు వెళ్లి ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావల్సిన డీఏ, పీఆర్సీ, సరెండర్ లీవ్స్ జీతం , ఇతర ఆర్థిక ప్రయోజనాలు, బదిలీలపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ కార్యక్రమాల్లో పాల్గొని, హక్కుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి వాటిని రాబట్టుకునే విధంగా ప్రయత్నించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: మండలంలోని బేస్తవారిపేట, మోక్షగుండం, పిటికాయగుళ్ల, అక్కపల్లె, శింగరపల్లె సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మరమ్మతుల కారణంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ సన్యాసిరావు తెలిపారు. మంగళవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

కొనకనమిట్ల మండలంలో మోస్తరు వర్షం


పాతపాడు వద్ద పొలంలో నిలిచిన నీరు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి, సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. గొట్లగట్టు, చినమనగుండం, పాతపాడు, బచ్చలకూరపాడు, నాగంపల్లి, సలనూతల, వింజవర్తిపాడు గ్రామాల్లో కురిసిన వర్షానికి పొలాల్లో నీరు చేరింది. గొట్లగట్టు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, అలాగే మెయిన్ రోడ్‌పై స్పీడ్ బ్రేకర్ వద్ద వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఖరీఫ్ అదును దాటుతోందని, వర్షాలు సక్రమంగా కురిసి భూములు పదునైతే వ్యవసాయ పనులు ముందుకు సాగుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

- హెచ్‌డీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే తాటిపర్తి
- ఎక్స్‌రే, థైరాయిడ్ విభాగాలు ప్రారంభం

పెద్దదోర్నాల:

నల్లమల అభయారణ్య పరిధిలోని నిరుపేద గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేలా వైద్యాధికారులు కృషి చేయాలని యర్రగొండపాలెం శాసన సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ వైద్యాధికారులను కోరారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం హాస్పటల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన వైద్యశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతం పెద్దదోర్నాల మండల పరిధిలో ఎన్నో గిరిజన గూడేలు, తండాలు ఉన్నాయన్నారు. అటువంటి చెంచు గిరిజనులు, నిరు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని చెప్పారు. దీంతో పాటు వైద్యశాల నిర్వహణకు సంబంధించిన నిధులు సక్రమంగా వినియోగించాలని ఆదేశించారు. సౌకర్యాలు మెరుగు పర్చుకోవాలని సూచించారు. మారుమూల ప్రాంతంలో ఉన్న వైద్యశాలైనందున అత్యవసర సేవలు చేయాల్సి వచ్చినప్పుడు వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చూడాలని సూపరింటెండెంట్ మహేశ్వరిని కోరారు. వైద్యశాలలో అవసరాలకు సరిపడా మందులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తాటిపర్తి సూచించారు. అత్యవసరమైన రోగులకు ప్రత్యేకంగా నేషనల్ హైవే అథారిటీకి సంబంధించిన ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో పాటు శస్త్ర చికిత్సలు చేసేందుకు సీయాం మెషిన్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. పోస్టుమార్టం గది ఏర్పాటు విషయమై అధికారులతో చర్చించి సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌రే, థైరాయిడ్ విభాగాలను ఆయన ప్రారంభించారు. వైద్యాధికారులు వైద్య సంజీవ్, ఖాదరయ్య, లావణ్య, మౌనిక, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, లాలూ నాయక్ పాల్గొన్నారు.


ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

మడియాలయ్య దేవరకు మొక్కులు తీర్చుకున్న భక్తులు

పుల్లలచెరువు: వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు బాగా పండాలని మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వారి ఇలవేల్పు మడియాలయ్య దేవరకు బోనాలు సమర్పించారు. రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామంలో రజకులంతా పాల్గొని బోనాలతో మడియాలయ్య దేవరను సందర్శించుకుని వానలు సకాలంలో కురిసి పంటలు బాగా పండి పాడిపంటలతో తులతూగాలని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి శావణ మాసంలో ఈ బోనాలు సమర్పిస్తామని రజక సంఘ నాయకులు గాలెయ్య తెలిపారు. దేవరకు మొక్కుబడిగా ప్రభను ఏర్పాటు చేసి ఊరేగింపు గ్రామ పురవీధుల్లో భక్తి పాటలు పాడుకుంటూ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


దేవరకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు